సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



నమో వేంకటేశా

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి ఆలయం వద్ద రద్దీ కనిపించింది. అన్ని విభాగాలూ కిటకిటలాడాయి.



వెండి బిందె సమర్పణ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్నకు చిరువూరి రాంబాబు దంపతులు (తణుకు మండలం సజ్జాపురం) 1.500 కిలోల బరువైన వెండి బిందెను సమర్పించారు.

సాయంకాలార్చన సమయం మార్పు



ద్వారకాతిరుమల: శ్రీవారి సాయంకాలార్చన సమయాన్ని ఈ నెల 13 నుంచి సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటలకు మారుస్తున్నట్టు ఈఓ త్రినాథరావు తెలిపారు.

న్యూస్‌రీల్

తణుకు కమిషనర్‌గా సుధాకర్



మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఈఈ ఈశ్వరరెడ్డి

తణుకు అర్బన్: తణుకు మున్సిపల్ కమిషనర్‌గా కేటీ సుధాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన సుధాకర్ బదిలీపై తణుకు మున్సిపాలిటీకి వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరించిన మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, ఆర్ఐ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కాలిగ్రఫీలో ప్రతిభ



జాహ్నవిని అభినందిస్తున్న దృశ్యం

పెనుగొండ: జాతీయ స్థాయి చేతిరాత దినోత్సవం సందర్భంగా అమ్మబడి హ్యాండ్ రైటింగ్, కాలిగ్రఫీ ఇన్‌స్టిట్యూట్, ఆల్ ఇండియా గ్రాఫాలజీ అసోసియేషన్, హ్యాండ్ రైటింగ్, కాలిగ్రఫీ ఇన్‌స్టిట్యూట్, హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ అసోషియేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో పెనుగొండ విద్యార్థిని జ్యోశ్యుల జాహ్నవి సత్తాచాటి 13వ స్థానాన్ని కైవసం చేసుకొంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి జరిగే కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతులమీదుగా అవార్డు తీసుకోనుంది. జాహ్నవిని భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.వెంకట అప్పారావు, చైర్మన్ భాష్యం రామకృష్ణ, సీఈఓ హనుమంతరావు అభినందించారు.

మందుల నిల్వలపై దాడి



మందులను స్వాధీనం చేసుకున్న అధికారులు

తణుకు: ప్రభుత్వం నిషేధించిన మందులను యథేచ్ఛగా విక్రయిస్తున్న దుకాణాలపై శనివారం ఔషధ నియంత్రణ శాఖ అధికారులు దాడులు చేశారు. తణుకులోని పలు మందుల షాపులతోపాటు అక్రమంగా నిల్వ ఉంచిన ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. పట్టణానికి చెందిన వెంకటసాయి మెడికల్ షాపులో తణుకు, భీమవరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అబిద్ ఆలీ, మల్లికార్జునరావు దాడులు చేసి మందులపై ఎమ్మార్పీతోపాటు బ్యాచ్ నంబర్లు చెరిపి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. షాపు యజమాని వద్ద రూ.2 లక్షల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే లక్ష్మీపవన్ ఏజెన్సీ నిర్వహిస్తున్న ఉప్పల సోమనాగేశ్వర శ్రీనివాసు స్థానిక సీపీఎం కార్యాలయం ఎదురుగా నిర్వహిస్తున్న కిరాణా దుకాణంలో రూ.60 వేల విలువైన మందులను సీజ్ చేశారు. వెంకట్రాయపురం రైల్వే గేటు సమీపంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని కాపకాయల శ్రీనివాసు అనే వ్యక్తి అక్రమంగా మందులు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేశారు. అతని వద్ద రూ.5.50 లక్షల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. అతడు లైసెన్స్ లేకుండా జిల్లావ్యాప్తంగా రిటైల్ షాపులు, మెడికల్ ఏజెన్సీలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. మొత్తం 3 కేసుల్లో రూ.8.10 లక్షల విలువైన మందులను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్‌ఆలీ చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు వేళాయె

- దశల వారీగా పరీక్షలు
- ఈనెల 15 నుంచి ప్రారంభం
- 20 నుంచి ప్రాక్టికల్స్
- వచ్చేనెల 15 నుంచి థియరీ పరీక్షలు
- 106 కేంద్రాలు.. 73,521 మంది విద్యార్థులు



ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. మూడేళ్లుగా ఇంటర్ పరీక్షలు పలు కారణాలతో వాయిదా పడటం, అనుకున్న సమయానికి ప్రారంభం కాకపోవడం, కరోనా సమయంలో రద్దు చేయడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. అయితే ఈ ఏడాది షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వం పరీక్షలు నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో ఇటు విద్యార్థులు అటు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ముందుగా ప్రకటించిన తేదీల ప్రకారం ఈనెల 15 నుంచి పరీక్షలు జరుగనున్నాయి. పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ఏలూరులోని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ప్రత్యేక దృష్టి సారించారు.

నైతికత, మానవ విలువలపై పరీక్షలు

ఇంటర్ పరీక్షల్లో భాగంగా ముందుగా ఈనెల 15న నైతికత, మానవ విలువలు అనే సబ్జెక్టుపై పరీక్ష నిర్వహించనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు తప్పనిసరిగా ఈ పరీక్ష ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. అలాగే ఈనెల 17న పర్యావరణ విద్య అనే సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు పూర్వ పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు జిల్లాలో 96 కేంద్రాల్లో 12,785 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 113 కేంద్రాల్లో 15,966 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 41 కేంద్రాల్లో 5,372 మంది మొత్తంగా 34,123 మంది హాజరుకానున్నారు.

పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో ఇలా..

థియరీ పరీక్షలు

జిల్లా	ఏలూరు	పశ్చిమగోదావరి	తూర్పుగోదావరి	మొత్తం
కేంద్రాలు	39	52	15	106
ప్రథమ సం॥ విద్యార్థులు	14,368	18,335	5,350	38,053
ద్వితీయ సం॥ విద్యార్థులు	13,047	17,414	5,007	35,468

ప్రాక్టికల్స్ (ఒకేషనల్)

జిల్లా	కేంద్రాలు	విద్యార్థులు
ఏలూరు	27	3,645
పశ్చిమగోదావరి	33	3,253
తూర్పుగోదావరి	16	1,519
మొత్తం	76	8,417

ప్రాక్టికల్స్ (జనరల్)

జిల్లా	కేంద్రాలు	విద్యార్థులు
ఏలూరు	58	8,666
పశ్చిమగోదావరి	64	11,919
తూర్పుగోదావరి	25	3,642
మొత్తం	117	24,227

ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

పరీక్షల్లో భాగంగా ముందుగా ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఈనెల 20 నుంచి వీరికి ప్రాక్టికల్స్ ప్రారంభమై వచ్చేనెల 7వ తేదీతో ముగుస్తాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులు నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు రాయవచ్చు. మొత్తంగా 8,417 మంది విద్యార్థులు హాజరయ్యే పరీక్షల కోసం 76 కేంద్రాలను సిద్ధం చేశారు. అలాగే జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఈనెల 26న ప్రారంభం కానున్నాయి. 147 కేంద్రాల్లో 24,227 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

వచ్చేనెల 15 నుంచి..

ఇంటర్మీడియెట్ థియరీ పరీక్షలు వచ్చేనెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. మొత్తం 73,521 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరి కోసం 106 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే సీసీ కెమెరాలన్నింటినీ ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేస్తున్నారు. అలాగే ప్రతి కేంద్రాన్నీ సెల్‌ఫోన్‌రహిత జోన్‌గా ప్రకటించారు. ఎవరూ కేంద్రాలకు సెల్‌ఫోన్ తీసుకురాకూడదనే నిబంధన విధించారు.

ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా..



గతేడాది కంటే ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులయ్యేలా అధ్యాపకులకు సూచనలిచ్చాం. కళాశాలల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడానికి ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. విద్యార్థులు కళాశాలలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడటం, వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించడం వంటివి చేస్తున్నాం.

– కె.చంద్రశేఖరబాబు, ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి, ఏలూరు

పోలవరం ప్రాజెక్టు కార్మికులకు అస్వస్థత



పోలవరం ఆస్పత్రిలో కార్మికులను పరామర్శిస్తున్న ప్రాజెక్టు ఎస్‌ఈ, ఆర్డీఓ

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. ప్రాజెక్టు వద్ద భోజనం చేసిన వారిలో సుమారు 85 మంది వేకువజామున కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడగా పోలవరంలో ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఐదుగురికి వైద్యశాలలో సెలైన్‌లు ఎక్కించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారంతా ప్రాజెక్టు ప్రాంతంలో వారు బస చేసే చోటుకు వెళ్లిపోయారు. చికిత్స పొందుతున్న కార్మికుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యాధికారులు తెలిపారు. డీఎంహెచ్‌ఓ నాగేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ ఏవీఆర్ మోహనరావు, ఆర్డీఓ ఎం.ఝాన్సీరాణి, ప్రాజెక్టు ఎస్‌ఈ కె.నరసింహమూర్తి, మేఘ ఏజెన్సీ ప్రతినిధులు, తహసీల్దార్ బి.సుమతి, డీఎస్పీ కె.లతాకుమారి, సీఐ కె.విజయబాబు, ఎస్సై ఎస్.పవన్‌కుమార్ ఆస్పత్రిలో కార్మికులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. రాత్రి క్యాంటీన్‌లో అందించిన భోజనం చేసినట్టు కార్మికులు వారికి తెలిపారు.

ప్రత్యేక వైద్యశిబిరం: కార్మికులకు చికిత్స అందించేందుకు 10 మంది వైద్యాధికారులతో పాటు సిబ్బందిని హుటాహుటిన ఏర్పాటు చేశారు. డీసీహెచ్‌ఎస్ మోహనరావు విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. తాగునీరు, ఆహార నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతామన్నారు.

మాతృభాషలో సాంకేతిక విద్యకు కృషి



భీమవరం శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

సాక్షి, భీమవరం: నేటి విద్యావిధానాన్ని సమీక్షించి, దాని స్థానంలో భారతీయ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. అందుకే ప్రధాని మోదీ నూతన విద్యావిధానం ద్వారా మాతృభాషలోనే సాంకేతిక విద్యను బోధించేలా కృషి చేస్తున్నారని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం భీమవరంలో పర్యటించిన ఆయన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆవరణలో విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడారు. మాతృభాషపై నిర్లక్ష్యం తగదని, భారత సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలన్నారు. చదువుతో పాటు వ్యాయామం, క్రీడల్లో పాల్గొనాలని, యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు మాట్లాడుతూ శ్రీ విష్ణు మహిళా ఇంజినీరింగ్ కళాశాల మహిళా ఉన్నత సాంకేతిక విద్యకు బ్రాండ్‌గా నిలిచిందన్నారు. అనంతరం వెంకయ్యనాయుడిని ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

పాశ్చాత్య అలవాట్లు వీడాలి

విద్యార్థులు పాశ్చాత్య అలవాట్లకు దూరంగా ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల 43వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. పట్టణాలతో సమానంగా పల్లెలు అభివృద్ధి చెందేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. యువత క్రమశిక్షణ, సమయపాలన, మంచి ఆలోచనలు, ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పం, ధైర్యం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. భీమవరం పూతరేకులు, రొయ్యలు, బొమ్మిడాయిలు చాలా బాగుంటాయని గతంలో తాను ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు వాటి రుచులు చూశానన్నారు. ముందుగా ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో రూ.2.50 కోట్లతో ఏర్పాటుచేసిన ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఆయన్ను ఘనంగా సత్కరించింది. కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్‌ఆర్‌కే నిశాంత్‌వర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం జగపతిరాజులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ, కళాశాల ఉపాధ్యక్షుడు పి.కృష్ణంరాజు, గోకరాజు రామరాజు, సాగి విఠల్‌రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం స్ఫూర్తిదాయకమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. భీమవరంలోని అల్లూరి విగ్రహాన్ని ఆయన సందర్శించి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అల్లూరి స్ఫూర్తితో విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు.

పేదింటి పెళ్లికి ప్రభుత్వ సాయం

కళ్యాణమస్తు.. షాదీ తోఫా

- జిల్లాలో 145 మందికి రూ.1.10 కోట్ల జమ
- ఇకపై ప్రతి మూడు నెలలకోసారి అందజేత
- సర్వత్రా హర్షాతిరేకాలు



భీమవరం కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): పేదింట్లో జరిగే వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కళ్యాణమస్తు–వైఎస్సార్ షాదీ తోఫా పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడత కళ్యాణమస్తు పథకాన్ని అమలుచేయగా పశ్చిమగోదావరి జిల్లాలో 145 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు రూ.1,10,65,000 నగదు జమచేశారు.

సర్వత్రా హర్షం

సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం కళ్యాణమస్తు–షాదీ తోఫా పథకం అమలు చేయడంపై లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబంలో ఆడ బిడ్డల వివాహం తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో పథకం అమలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్గాల వారీగా లబ్ధి ఇలా..

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.లక్ష, ఎస్సీ, ఎస్టీ కులాంతర వివాహాలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, బీసీల కులాంతర వివాహాలకు రూ.75 వేలు, దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, ఓసీలోని భవన నిర్మాణ కార్మికులకు రూ.40 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇలా అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోంది.

203 దరఖాస్తులు

2022 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న వారిలో అర్హులకు తొలి విడత సాయం అందించారు. మొత్తంగా 203 దరఖాస్తులు రాగా 145 మంది లబ్ధిదారులు ఉన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు –వైఎస్సార్ షాదీ తోఫా సొమ్ములను వచ్చే త్రైమాసికం నుంచి పెళ్లికూతుళ్ల తల్లుల ఖాతాలకు జమ చేస్తామని సీఎం జగన్ ప్రకటించారు. ఇకపై ప్రతి మూడు నెలలకోసారి లబ్ధిదారులకు పథకం కింద సాయం అందించనున్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో వివాహాలు చేసుకున్న వారు ఏప్రిల్ ఆఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి మే నెలలో ప్రోత్సాహం అందిస్తారు.

మొదటి విడత లబ్ధి ఇలా..

వర్గం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.లక్షల్లో)
ఎస్సీలు	52	52.00
ఎస్సీ కులాంతర	9	10.80
ఎస్టీ కులాంతర	1	1.20
బీసీలు	65	32.50
బీసీ కులాంతర	15	11.25
మైనార్టీ	1	1.00
దివ్యాంగులు	1	1.50
భవన నిర్మాణ కార్మికులు (ఓసీ)	1	0.40
మొత్తం	145	110.65

చాలా సంతోషంగా ఉంది



నాకు గతేడాది డిసెంబర్‌లో వివాహమైంది. నేను కళ్యాణమస్తు పథకానికి దరఖాస్తు చేసుకున్నా. పథకంలో భాగంగా సాయం అందించడం చాలా సంతోషంగా ఉంది. సీఎం జగనన్న ఈ పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక చేయూత పేద, మధ్యతరగతి వర్గాల తల్లిదండ్రులకు భరోసాగా ఉంటుంది. ఆడ పిల్ల పెళ్లికి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఓ అన్నగా, ఓ పెద్ద కొడుకుగా సీఎం జగన్ అండగా నిలుస్తున్నారు.

–మారగాని లలిత, విస్సాకోడేరు

సద్వినియోగం చేసుకోవాలి

కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో మొదటి విడతగా 145 మందికి రూ.1.10 కోట్ల సాయం అందించాం. ఇకపై ప్రతి మూడు నెలలకోసారి లబ్ధిదారులకు పథకాన్ని అమలు చేయనున్నాం. పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించాలి. వివాహానికి సంబంధించిన పత్రాలు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు తదితర వివరాలు సమర్పించారు. అర్హులు వివాహమైన తర్వాత వేగంగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి.

– పి.ప్రశాంతి, కలెక్టర్



మధురిమలు పంచుకోండి..

మధురంగా..



♥ ప్రేమికుల రోజును ఇలా సెలబ్రేట్ చేసుకుంటే.. ఎప్పటికీ మరువలేరు !

♥ నెట్టింట వైరల్ అవుతున్న సూచనలు ♥ హార్ట్ సింబల్‌తో థ్యాంక్స్ చెబుతున్న ప్రేమికులు

ప్రేమ అనేది ఓ మధుర భావన. ఇది మనసులను కలుపుతుంది.. మనుషులను దగ్గర చేస్తుంది. ప్రేమతో జీవించడం.. జీవితంలోని మాధుర్యాన్ని మన దరి చేరుస్తుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్నవారైనా.. పెళ్లి తర్వాత ప్రేమించుకుంటున్నవారైనా.. అంతిమంగా తమ భాగస్వామిపై చూపే ప్రేమే వారి జీవిత గమనాన్ని మధురంగా మారుస్తుంది. మరి ఇలాంటి జంటలు ఈ ఏడాది ప్రేమికుల రోజును ఎలా జరుపుకోవాలనే దానిపై ఆలోచిస్తుంటే.. వారికి నెటిజన్లు అనేక సూచనలు అందిస్తున్నారు. వాటిలో కొన్ని ఖర్చుతో కూడుకున్నవి కాగా.. మరికొన్ని తక్కువ వ్యయంతో ప్లాన్ చేసుకోదగినవి. అసలు ఖర్చే అవసరం లేనివి కూడా ఇందులో ఉన్నాయి. వాటిలో తమకు ఉత్తమంగా అనుకున్నవి.. సాధ్యమయ్యేవి ప్లాన్ చేసుకుని సెలబ్రేట్ చేసుకుంటే.. ఆ మాధుర్యాన్ని ఎప్పటికీ మరిచిపోలేరని కూడా చెబుతున్నారు. ఇవి నెట్టింట చాలా ఎక్కువమందిని ఆకట్టుకుంటుండటం విశేషం. అవేంటో తెలుసుకోవాలనే ఆసక్తి ఉందా.. అయితే.. ఇవి మీకోసమే..

– సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్



సండే స్పెషల్

- ♥ ఒక గులాబీ.. ఒక చాక్లెట్.. ఒక గ్రీటింగ్ కార్డ్.. ఒక కేక్.. ఒక గిఫ్ట్.. ప్రేమికుల రోజును ఇలాంటి వాటితో ఆరంభించండి.. మీకు ప్రియమైన వారిపై మీకున్న ప్రేమను తెలియజేయండి. రోజూ చూపే ప్రేమను ఇది ఎన్నో రెట్లు ఎక్కువగా చేస్తుంది. ఈ అనుభూతి మరింత మధురానుభూతులను మీ జీవితంలో నింపుతుంది.
- ♥ నచ్చిన ఆట.. కలిసి ఆడండి. ఉదాహరణకు చెస్, క్యారమ్స్ వగైరా.. ఏదైనా.. ఆ ఆట ఇద్దరి మధ్య బంధాన్ని మరింత పెంచుతుంది.
- ♥ మీకు ఇష్టమైన పాటలను కలిసి ఎంచుకోండి. మీ సంబంధాన్ని గుర్తుచేసే, మీ భాగస్వామికి ఎక్కువగా ఇష్టమైన పాటలకు అందులో ప్రాధాన్యత ఇవ్వండి. వాటిని మీ ప్లే లిస్ట్‌లో ఉంచేందుకు సమయం కేటాయించండి.
- ♥ ఇద్దరూ కలిసి ఒకరోజు గడపడంలో ఉత్తమమైన మార్గాల్లో మరొకటి.. స్వచ్ఛంద సేవ. ఇతరులకు స్వయంగా సేవ చేయడం మీరు ఒకరికొకరు మరింత కనెక్ట్ అయ్యేలా చేస్తుంది.
- ♥ మీ సొంత ప్రాంతంలో పర్యాటకులుగా మారండి. మీ పట్టణంలో ఏదైనా ప్రసిద్ధమైన ప్రాంతాన్ని లేదా మీరు ఎప్పుడూ చూడని మ్యూజియాన్ని సందర్శించండి. ఫొటోగ్రాఫర్లుగా మారి నచ్చిన విధంగా ఫొటోలు తీయండి.
- ♥ మీ ఇద్దరి తీపి గుర్తులను కలిపి ఒక విలువైన పుస్తకంగా రూపొందించండి. లవ్ లెటర్లు, దుస్తులు, చేతి రుమాళ్లు, బహుమతులు, ఫొటోలు, పాత సినిమా టికెట్లు, గుర్తుగా దాచుకున్నవాటిని సేకరించి దీనిని తయారుచేయండి.
- ♥ డ్రైవ్ కోసం వెళ్లండి.. కారు లేదా బైక్ ఫుల్ ట్యాంకు చేయించండి. ఇది కొంత ఖర్చుతో కూడుకున్నది కావచ్చు. అయినా ఇది మీరు వెళ్లే కొత్త ప్రాంతంలో సరికొత్త అనుభూతులను కలిసి ఆస్వాదించేందుకు ఉపకరిస్తుంది.
- ♥ ఇద్దరూ కలిసి మీ ప్రేమకు సింబాలిక్‌గా ఉండేలా గోడకు తగిలించే లేదా వేలాడదీసే ఒక ఆహ్లాదకరమైన కళాత్మక వస్తువును రూపొందించండి. దానిని మీరు నిత్యం సంచరించే ప్రాంతంలో ఏర్పాటు చేయండి.
- ♥ ఇద్దరికీ ఇష్టమైన రొమాంటిక్ సినిమాలు చూడండి. పాప్ కార్న్ వంటి స్టఫ్ కూడా అందుబాటులో పెట్టుకోండి.
- ♥ ఒకరికొకరు ప్రేమలేఖలు రాసుకోండి. ఇంతకుముందే రాసిన అనుభూతులు ఉన్నప్పటికీ.. ఇప్పుడు కొత్తగా ప్రయత్నించండి. మీ భాగస్వామి మీకు ఎందుకు ప్రత్యేకమైన వారో అందులో పొందుపరచండి. మీ భాగస్వామిలోని ఏ లక్షణాలను మీరు ఎక్కువగా ఆరాధిస్తారో, వారు మిమ్మల్ని ఎలా భావిస్తారో, మీరు వారితో ఎందుకు ప్రేమలో పడ్డారో ఆ లేఖలో తెలియజేయండి.



- ♥ ఇద్దరూ కలిసి ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకోవడానికి ప్రయత్నించండి. అది వంటకం కావచ్చు.. డ్యాన్స్ కావచ్చు.. మరేదైనా కావచ్చు.
- ♥ కలిసి యోగా లేదా వ్యాయామం సాధన చేయండి. ఆ సమయాన్ని ఆస్వాదించండి.
- ♥ ట్రెజర్ హంట్ (నిధి వేట) లాంటి ఆసక్తికరమైన ఆట ఎంచుకోండి. మీ భాగస్వామికి ఇచ్చేందుకు తీసుకొచ్చిన ప్రేమికుల రోజు బహుమతిని దాచి ఉంచండి. దానిని కనుగొనడానికి ఆధారాలు రూపొందించి దానిని కనిపెట్టాలని సూచించండి.
- ♥ ఇద్దరూ కలిసి షాపింగ్‌కు వెళ్లండి. ఒకరి కోసం ఇంకొకరు ఇష్టమైన వస్తువును కొనడానికి ప్రయత్నించండి.
- ♥ ఇద్దరూ కలిసి అందమైన పూలతోటను సందర్శించడానికి ప్రయత్నించండి. కనీసం మీకు సమీపంలోని నర్సరీకి వెళ్లి ప్రేమికుల రోజుకు గుర్తుగా ఒక మొక్క కొనుగోలు చేయండి. అద్భుతమైన ఫొటోలూ తీసుకోండి.
- ♥ ఇద్దరూ కలిసి పెయింట్ చేయండి. మీరు పెయింటర్లు కాకపోవచ్చు.. అయినా ఇద్దరూ కలిసి ఒక సొంత కళాఖండం రూపొందించడానికి ప్రయత్నించండి. అది తప్పనిసరిగా సరికొత్త అనుభూతులను పంచుతుంది.
- ♥ ప్రేమకు సూచిక అయిన హార్ట్ సింబల్‌లో ఆహారాన్ని కలిసి తయారు చేయండి. చపాతీ, పిజ్జా, ఆమ్లెట్, కేక్.. ఇలా మీ ఊహ మేరకు ప్రయత్నించండి. లేదంటే హార్ట్ సింబల్ ఆకారంలో కేక్‌కి ఆర్డర్ ఇవ్వండి.



- ♥ రాత్రి భోజనం కలిసి వండండి. ఒక సూపర్ బిజీ రెస్టారెంట్‌లో తినడానికి బయటకు వెళ్లడం కంటే ప్రత్యేకంగా ఇంట్లో వండిన భోజనం చాలా రొమాంటిక్‌గా ఉంటుంది. మీలో ఒకరికి చెఫ్‌కి సమానమైన నైపుణ్యాలు లేకపోయినా, మీరు ఇద్దరూ ఆనందించే చిరస్మరణీయమైన విందును చేయవచ్చు.



అంతర్ జిల్లా బాల నేరస్తులు ముగ్గురి అరెస్టు

రూ.20 వేల విలువైన మద్యం, బైక్ స్వాధీనం

తణుకు: మద్యం దుకాణంలోకి చొరబడి అక్రమంగా మద్యం దొంగిలించిన ముగ్గురు అంతర్‌జిల్లా బాల నేరస్తులను తణుకు రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి వద్ద రూ.1.10 లక్షల విలువైన మద్యంతోపాటు ఒక మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రూరల్ పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సీహెచ్ ఆంజనేయులు వివరాలు వెల్లడించారు. గతేడాది డిసెంబరు 29న రాత్రి సమయంలో తణుకు మండలం మండపాక గ్రామంలోని బ్రాందీషాపునకు మోటారు సైకిల్‌పై వచ్చిన నలుగురు బాలురు వాచ్‌మేన్‌ను మద్యం అడిగారు. ఈ సమయంలో మద్యం దొరకదని సమాధానం చెప్పడంతో అతన్ని చంపేస్తామని కొట్టి బెదిరించి షాపు తాళాలు పగలగొట్టి 90 మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. వీటిలో కొన్ని బాటిళ్లను వేల్పూరు మినీ బైపాస్ రోడ్డులో తుప్పల్లో దాచి మిగిలిన వాటిని తాగేశారు. ఈనెల 10న మినీబైపాస్ రోడ్డులో దాచిన మద్యం తీసుకెళ్లేందుకు వచ్చారు. దీంతో పోలీసులకు వచ్చిన సమాచారంతో సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో దాడి చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.20 వేలు విలువైన మద్యం, రూ.90 వేలు విలువైన బైక్ స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిపై భీమవరం, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, వీరవాసరం, పాలకొల్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు, కాకినాడ, గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసుస్టేషన్లలో పలు కేసులు నమోదు అయినట్లు సీఐ వెల్లడించారు. కేసును ఛేదించిన రూరల్ ఎస్సై కె.గుర్రయ్య, సిబ్బందిని సీఐ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆంజనేయులు, నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం

శ్రీవారి సేవలో జేపీసీ చైర్మన్



జస్టిస్ బి.శివశంకరరావుకు శ్రీవారి మెమెంటోను అందజేస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ బి.శివశంకరరావు శనివారం ఉదయం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

ఇంటింటా సంక్షేమ బావుటా



పోడూరు: పోడూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



విక్టర్ పాల్ మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్: కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీ వైపు రోడ్డులో జాతీయ రహదారి అండర్ పాస్ వద్ద శనివారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రూరల్ ఏఎస్సై పీవీకే దుర్గారావు తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన కోడి విక్టర్ పాల్ (46) తాడేపల్లిగూడెంలోని తన సోదరి ఇంటికి వచ్చాడు. ఆమెకు చెందిన మోపెడ్‌పై బయటకు వెళ్లాడు. అయితే శశి ఇంజనీరింగ్ కళాశాల నుంచి కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీకి వెళ్ళే రహదారిలో జాతీయ రహదారి అండర్ పాస్ వద్ద మృతి చెంది ఉన్నాడు. విక్టర్ పాల్ వేసుకొచ్చిన మోపెడ్ జాతీయ రహదారిపైన ఉండగా, ఆ పక్కనే పలావు పొట్లం ఉంది. జాతీయ రహదారి పైనుంచి కళాశాలకు వెళ్లే కంకర రోడ్డుపై ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. తల్లి కోడి భాగ్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతానికి న్యాయవాది మృతి

నూజివీడు: కొత్తగా నిర్మించుకుంటున్న ఇంట్లో వాటరింగ్ చేస్తుండగా విద్యుత్ వైరు తగిలి ఓ న్యాయవాది మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన న్యాయవాది పేర్ల రామలింగేశ్వరరావు (రాము) (46) ఎంప్లాయీస్ కాలనీలో కొత్త ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో వాటరింగ్ చేసేందుకు కుమార్తెతో కలిసి వెళ్లారు. కుమార్తె మొదటి అంతస్తులో వాటరింగ్ చేస్తుండగా, రామలింగేశ్వరరావు గ్రౌండ్‌ఫ్లోర్‌లో వాటరింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న విద్యుత్ వైరు రామలింగేశ్వరరావుకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై స్పృహ తప్పి పడిపోయారు. స్థానికులు గమనించి హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. నూజివీడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోక్ అదాలత్‌లో 7,273 కేసుల పరిష్కారం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 7,273 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి చెప్పారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో కోర్టులున్న అన్ని ప్రదేశాలలో మొత్తం 36 బెంచ్‌లను ఏర్పాటు చేసి, మొత్తం 7,273 కేసులు పరిష్కరించామన్నారు. ఇందులో 6,945 క్రిమినల్, 200 సివిల్ కేసులు ఉన్నాయన్నారు. అలాగే ప్రమాద బీమా కేసులు 128 పరిష్కరించి రూ.9,02,16,000 పరిహారంగా కక్షిదారులకు చెల్లించడం జరిగిందన్నారు. ఇవి కాక మరో 212 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి జి.రాజేశ్వరి వివరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

పాలకోడేరు: పాలకోడేరు శివాలయం వద్ద ఆటోలో తరలిస్తున్న 600 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు శనివారం చెప్పారు. గరగపర్రుకు చెందిన పదాల వెంకట సత్యనారాయణకు చెందిన బియ్యంగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పశువులను కడిగేందుకు చెరువులోకి దిగి..

ఊపిరాడక యువకుడి మృతి

భీమడోలు: భీమడోలులోని చెరువులో పశువులను కడిగేందుకు దిగి ప్రమాదవశాత్తు మునిగి ఊపిరాడక ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. భీమడోలు సోమాకాలనీకి చెందిన మాగంటి సాయి వంశీ (19) పదో తరగతి వరకు చదివి ఇంట్లో గేదెలను మేపుతున్నాడు. కొంతకాలంగా ఇతను మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఎప్పటిలానే శనివారం గేదెలను చెరువు వద్ద మేపేందుకు తీసుకువెళ్లాడు. అనంతరం గేదెలు సమీపంలో ఉన్న చెరువులోకి దిగాగా, వాటిని కడిగేందుకు వంశీ కూడా వాటి వెనుకే వెళ్లాడు. అయితే లోతు ఎక్కువగా ఉండటంతో పాటు ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. దీనికి తోడు చెరువులో గుర్రపుడెక్క, తూడు ఎక్కువగా ఉండటంతో నీటి అడుగున ఉండిపోయాడు. కొద్దిసేపటికి అక్కడకు వచ్చిన అతని తమ్ముడు చెరువు గట్టు వద్ద అన్న చెప్పులను గుర్తించి అతను కనిపించకపోవడంతో అనుమానంతో స్థానికులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అగ్నిమాపక అధికారి నాగరాజుకు సమాచారం అందగా సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చెరువులో నుంచి వంశీని బయటకు తీసుకువచ్చారు. వెంటనే అతనిని సమీపంలోని సీహెచ్‌సీకి తీసుకువెళ్లి పరీక్షించగా, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెరువు నుంచి యువకుడిని బయటకు తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు

క్లుప్తంగా

ముత్యాలమ్మ చీరకు దాతల విరాళం



ముత్యాలమ్మవారికి వెండి చీర నిమిత్తం విరాళం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మ వారి వెండి చీర నిమిత్తం దాతలుగా విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం భీమవరం కోపల్లె ప్రాంతానికి చెందిన వీరవల్లి శ్యామ్, తులసీ నాగేశ్వరరావు దంపతులు కిలో వెండిని బహూకరించారు. అలాగే, తాడేపల్లిగూడెం సత్యవతినగర్‌కు చెందిన పులవర్తి నాగేంద్రకుమార్ రూ.25వేలు వెండి చీర నిమిత్తం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, అర్చకులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

తాడేపల్లిగూడెం: దీనదయాల్ ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమేశ్వరరావు అన్నారు. పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి శనివారం స్థానిక సర్దార్ వల్లభాయ్ పటేల్ శక్తి కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా నరిశే సోమేశ్వరరావు మాట్లాడుతూ దీన్‌దయాళ్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రధాని మోదీ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లా శ్రీనివాసు, నరిశే బలప్రకాష్, పుల్ల సాయిరాం, జంగం నరేష్ , సింగం జగన్, గరగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఈడూరులో విశేష అలంకరణలో వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వర స్వామివారికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించి స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను చేసారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకుని, ఏడువారాల నోము నోచుకుని, స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేసారు. రాత్రి స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో జీవ ధ్వజ ప్రతిష్ఠాపన



వేణుగోపాలస్వామి ఆలయం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మంత్రి కారుమూరి

అత్తిలి: తిరుపతిపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయంలో జీవ ధ్వజ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జీవ ధ్వజ ప్రతిష్ఠాపన పూజల్లో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో అంధత్వ నివారణ

ఆకివీడు: పోషకాహారంతో అంధత్వ నివారణ చేపట్టవచ్చునని ఎంపీపీ కఠారి జయలక్ష్మి చెప్పారు. మండలంలోని పెదకాపవరం పీహెచ్‌సీలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పేరూరి వెంకటేశ్వర్లు, కాశీరత్నం నేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ వయస్సు పెరిగే కొద్దీ కంటి చూపు సమస్య వస్తుందన్నారు. పోషక విలువలు తగ్గినా, పౌష్టికాహారం అందకపోయినా, విటమిన్ల లోపాలతో కంటిచూపు సమస్యలు వస్తాయన్నారు. ఈ సమస్య నుంచి విద్యార్థుల్ని కాపాడేందుకు జగనన్న గోరుముద్ద కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీపీ చెప్పారు. ప్రతీ రోజూ గుడ్డు అందజేసి విద్యార్థుల్లో ఏ విటమిన్ సమస్యను తొలగిస్తున్నారన్నారు. అంధత్వ లోపాలను కంటి వైద్యుల సలహాల మేరకు నివారించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

కేసుల సత్వర పరిష్కారమే లోక్ అదాలత్ లక్ష్యం



తణుకు కోర్టులో మాట్లాడుతున్న న్యాయమూర్తులు



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు

తణుకు అర్బన్:కేసుల సత్వర పరిష్కారానికి లోక్ ఆదాలత్ ఎంతగానో ఉపయోగపడతాయని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ అన్నారు. తణుకులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. 9వ అదనపు జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో 3 బెంచ్‌లుగా ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించగా 1వ బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, అడ్వకేట్ మెంబరుగా కౌరు వెంకటేశ్వర్లు, 2వ బెంచ్‌కు ఒకటవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పి.బాబు, అడ్వకేట్ మెంబరుగా టి.సత్యనారాయణరాజు, 3వ బెంచ్‌కు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఏవీ నాగరాజు, అడ్వకేట్ మెంబరుగా ఎ.అజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ 17, క్రిమినల్ 111, బెంచ్ కోర్టు కేసులు 508, ప్రీలిటిగేషన్ కేసులు 46 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జడ్జి అన్నపూర్ణ మాట్లాడుతూ ఇరువర్గాల అంగీకారంతోనే కేసులు పరిష్కారమవుతాయన్నారు. సమయం, డబ్బు వృథా కాకుండా మధ్యవర్తిత్వం ద్వారా ఈ కేసులను పరిష్కరించేందుకు ఈ లోక్ అదాలత్‌లు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం: లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే కోర్టుల చుట్టూ తిరగనక్కరలేకుండా సమస్యలను పరిష్కరించుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు అన్నారు. జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా శనివారం కోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని అనుసరించి తయారు చేసుకున్న చట్టాలను గౌరవించుకుంటూ, చిన్న చిన్న సమస్యలకు కూడా న్యాయ స్థానాలను ఆశ్రయించకుండా ఉంటే మేలన్నారు. కేసులు పెట్టుకున్నా, అవకాశం కలిగినప్పుడు లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకుంటే కాలంతో పాటు అన్ని కలిసి వస్తాయన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో 785 కేసులను పరిష్కరించారు. బెంచ్‌కోర్టు, బీఎస్ఎన్ఎల్, బ్యాంకు సంబంధిత కేసులు వీటిలో 631 ఉన్నాయి. వీటి పరిష్కారం ద్వారా 78 లక్షల 28వేల రూపాయల పరిహారాలు లభించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.నాగమల్లేశ్వరి, సెకండ్ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి సీ.రమ్య, ఫస్టు అడిషినల్ మునిసిఫ్ డి.అరుంధతి, ఏపీపి ఎస్.విజయకృష్ణ, అడ్వకేట్లు టి.రాంబాబు, సీహెచ్.ఇశ్రాయేల్‌రాజు, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల చేస్తే కఠిన చర్యలు తీసుకుంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మీ చెప్పారు. శనివారం తణుకు పైడిపర్రు సెక్టార్‌లో గల దువ్వ, ముద్దాపురం, కోనాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పైడిపర్రులోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాలికల వివాహ వయస్సు, పౌష్టికాహారం, గురించి వివరించారు. గ్రామాల్లో బాలికల వివాహాల విషయంలో తల్లిదండ్రులతో పాటు పూజార్లు, పాస్టర్లు కూడా నిర్ణీత వయస్సు రాకుండా పెళ్లిళ్లు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుంతలో ముసలమ్మ నూతన విగ్రహ ప్రతిష్ట



పుంతలో ముసలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: మండలంలోని కంతేరు గ్రామంలో వేంచేసి ఉన్నా పుంతలో ముసలమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి రాష్ట్ర పౌరాసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలు చల్లగా ఉన్నాయి అంటే అది గ్రామా దేవతల పుణ్యమేనని అన్నారు. అటువంటి గ్రామా దేవత పాత విగ్రహం చిన్నది కావడంతో పెద్ద విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. అభివృద్ధి , సంక్షేమంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రజలు సంతోషంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామ దేవతకి ప్రత్యేక పూజలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొపిశెట్టి దుర్గా ప్రసాద్, వెలగల సుభాష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కర్రి నరసింహరామకృష్ణ రెడ్డి, ఎంపీటీసీ గుడిమెట్ల దుర్గా, సర్పంచ్ గుడిమెట్ల ఆది లక్ష్మీ, గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, గుడిమెట్ల వీర్రెడ్డి, జవ్వాది సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్

సాక్షి, భీమవరం: భీమవరం టుటౌన్ ప్రాంతంలో ఓ ఆర్టీసీ బస్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. భీమవరం ఆర్టీసీ డిపోనకు చెందిన బస్ శనివారం తాడేపల్లిగూడెం నుంచి గణపవరం మీదుగా భీమవరం వస్తుండగా ఉండి రోడ్డులో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బస్ డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

బాకీ అడిగినందుకు దాడి

పాలకోడేరు: తన వద్ద వారం క్రితం తీసుకున్న రూ.10 వేలు అప్పును తిరిగి ఇవ్వమని అడిగితే బండి దొరబాబు అనే వ్యక్తి చేతిలో ఉన్న తాళం చేతులతో ముఖంపై కొట్టి గాయపరిచాడని వేంద్రకు చెందిన గూడూరు శివప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడు దొరబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎట్టకేలకు సాగునీటి సమస్యకు చెక్



దర్శిపర్రు డ్యాం వద్ద నుంచి రైతులు పంట కాలువను శుభ్రం చేసుకొంటున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని పెంటపాడు నెంబర్-1 ఛానల్ సాగుబోదె ద్వారా గత కొద్దిరోజులుగా ఆ ప్రాంతంలోని సుమారు 280 ఎకరాలకు సాగునీరు సరిగా అందడం లేదు. అయితే ఈ విషయాన్ని దర్శిపర్రు, జట్లపాలెం, పెంటపాడు గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు తమ సమస్యలను వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, వ్యవసాయ సలహామండలి సభ్యులు అయిన నల్లమిల్లి విజయానందరెడ్డి దృష్టికి శనివారం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ కిరణ్‌కుమార్‌ను వ్యవసాయసలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్‌లను సంప్రదించి ఇరిగేషన్ సిబ్బందిని అప్రమత్తం చేసారు. తొలుత రైతులు దర్శిపర్రు డ్యాం నుంచి జట్లపాలెం తూము వరకు పంటబోదెను శుభ్రం చేసుకోమని సూచనలు ఇచ్చారు. అనంతరం నెంబర్-1 ఛానల్‌కు నీటి విడుదల పెంచుతామని ఏఈ తెలిపారు. దీంతో సాగునీటి సమస్య పరిష్కారమయ్యింది. సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఇరిగేషన్ సిబ్బంది, వ్యవసాయసలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

మధుర గాయకుడు ఘంటసాలకు నివాళి



తణుకులో ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

తణుకు టౌన్: తెలుగు సినీ జగత్తులో మధుర గాయకుడు ఘంటసాల పాడిన పాటలు చిరస్మరణీయంగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు వావిలాల సరళాదేవి చెప్పారు. శనివారం మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 49వ వర్ధంతి సందర్భంగా తణుకులోని ఎన్టీయార్ పార్కు వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఘంటసాల పాటల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వావిలాల వెంకట రమేష్, గాయకులు చిప్పాడ నాగేశ్వరరావు, ఆకుమర్తి రాజు, కూచిపూడి నాట్య కారుడు కాకరపర్తి కామేష్లతో పాటు రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

అమరగాయకుడు ఘంటసాల

తాడేపల్లిగూడెం: అమరగాయకుడు ఘంటసాల వర్థంతిని పురస్కరించుకొని వీకర్స్‌కాలనీ వద్ద ఉన్న విగ్రహం వద్ద ఘంటసాల గానసభ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నివాళులర్పించారు.గానసభ అధ్యక్షుడు ఖాసిం మాట్లాడుతూ ఘంటసాల స్వరం తెలుగుభాషకు వరం అన్నారు. భగవద్గీత ఆయన అందించిన మరపురాని గానం అన్నారు. సూర్యచంద్రులు ఉన్నంత కాలం ఆయన స్వరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గానసభ కార్యదర్శి జెకె.కృష్ణ, అల్లం శంకరరావు, డ.బాలాజీ, మల్లాది సూర్యనారాయణ, ఎస్.ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

భైరాగి మఠం- విష సర్పాలకు నిలయం

చిట్టడివిని తలపిస్తున్న ఆలయ పరిసరాలు



ఆలయం వద్ద అడవిలా కన్పిస్తున్న గార్డెన్

పెంటపాడు: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా పిలిచే కె. పెంటపాడు బైరాగిమఠంలోని వేణుగోపాలస్వామి ఆలయం పిచ్చిమొక్కలతో చిట్టడివిని తలపిస్తోంది. గత కొన్ని నెలలుగా శుభ్రత లేకపోవడంతో ఈ ప్రాంతంలో విషసర్పాలు సంచరిస్తున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పడమర రాజగోపురం వైపు వచ్చేందుకు జంకుతున్నారు. ఈ మార్గం మొత్తం మూసుకుపోయి భక్తులకు అసౌకర్యంగా ఉంది. ఈ ప్రాంతంలో అరటిచెట్లు, కొబ్బరి మొక్కలు వేసారు. కానీ వీటి ఆలనా, పాలనా పట్టించుకోవడం లేదు. సాయంత్రం సమయాల్లో మందుబాబులు ఇక్కడే మద్యం తాగి సీసాలు పడవేస్తున్నారు. ఆలయం చుట్టూ ప్రహారీ ఉన్నా రక్షణ లేకపోవడం పట్ల గ్రామస్తులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమగ్ర కులగణన జరగాలి



బీసీ కులాల రాష్ట్ర రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: దేశంలో కులగణన జరగపోవడం వల్ల బీసీ సమాజం చాలా నష్టపోతుందని, కేంద్రం త్వరలో చేపట్టబోయే జనగణనలో సమగ్ర కులగణన చేయాలని శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశంలో డిమాండ్ చేశారు. దేశంలో 54 శాతంగా ఉన్న బీసీ సమాజానికి 27 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పిస్తున్న ప్రభుత్వాలు ,15 శాతంగా ఉన్న ఓసీ జనాభాకు పదిశాతం రిజర్వేషన్‌లు కల్పించడం, ప్రభుత్వాలకి బీసీ జనాభా పట్ల ఉన్న చిన్న చూపనకు నిదర్శనమన్నారు. ఏపీ ప్రభుత్వం కూడా బీహార్ ప్రభుత్వం తరహాలో కులగణన చేపట్టాలని సమావేశంలో వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, నాయకులు చిటికెన ప్రసాద్, చింతకాయల సత్యనారాయణ, మండల నాగేశ్వరరావు, కేశవభట్ల విజయ్, ముద్రగడ లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లకోడు లేఅవుట్‌కు మంచినీటి సరఫరాపై చర్చ

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల్లోని పేదల ఇళ్లకు మంచినీటి సరఫరాపై పంచాయతీ సమావేశంలో చర్చించారు. సర్పంచ్ ముత్యాల అనురాధ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో తాళ్లకోడులోని జగనన్న కాలనీలో లబ్ధిదారులకు మంచినీటి సరఫరాకు గ్రామంలోని చెరువు కేటాయింపుపై చర్చించారు. గ్రామంలో మల్లయ్య చెరువు, పెద, చిన్న చాకిరేవు చెరువులు, ఊర చెరువు, కొత్త చెరువు, తోలేటి కుంట, అంకోడు హరిజన పేట చెరువులున్నాయని కార్యదర్శి ఆనంద్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాభివృద్ధి, పెరుగుతున్న గ్రామ జనాభాను దృష్టిలో పెట్టుకుని నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అనురాధ సూచించారు. తొలుత గ్రామ పెద్దలు ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం), నంద్యాల సీతారామయ్య, బండి కొండ, ముత్యాల శివయ్య తదితరులు సమావేశం నిర్వహించి తాళ్లకోడులో 3,600 మందికి పట్టాలు ఇచ్చినందున సుమారు 10 వేల మంది జనాభా ఉంటారని చెప్పారు. జనాభాకు సరిపడే విధంగా మంచినీటి చెరువు తవ్వాలన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న ఊర చెరువును స్థానిక ప్రజల అవసరాలకు వినియోగించుకుని, సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొత్త చెరువు లేదా తోలేటి కుంట కేటాయించేందుకు సర్వే చేయించి, లేఅవుట్ ప్రజలకు మంచి నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తోలేటి కుంట ప్రాంత 1.70 సెంట్ల భూమిని చెరువుగా కేటాయించేందుకు పంచాయతీ తీర్మానం చేసింది. సమావేశంలో పలువురు వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



అత్తిలి మండలం బల్లిపాడులో నవగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: బల్లిపాడు శ్రీకాశీవిశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గణపతి ప్రయుక్త నవగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా రెండవరోజైన శనివారం విశేష పూజలు జరిగాయి. ఉదయం వాస్తుపూజ, హోమాలు, నవగ్రహ కల్పము, క్షీరాధివాసము, జలాధివాసం, హోమ పూజలు నిర్వహించారు. వెలవలపల్లి బాలసుబ్రహ్మణ్యశాస్త్రీ ఆధ్వర్యంలో, ఆలయ అర్చకులు బాదంపూడి సోమశేఖరశర్మ ప్రతిష్ఠాపన పూజాదికాలను జరిపారు. గ్రామప్రముఖులు ఆకుల పండుస్వామి, ఆకుల భుజంగరావు, కసిరెడ్డి బాలాజీ, తలారి శ్రీనివాస్, ధనుమూరి తాతాజీ, వడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో సుస్థిర అభివృద్ధి



రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భీమవరం నియోజకవర్గంలో సుస్థిర అవృద్ధి జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు, ఉమ్మడి గోదావరి జిల్లాల పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం రాత్రి భీమవరం వచ్చిన ఆయన ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి మాట్లాడారు. అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజీ పడే పరిస్థితి లేదని పేర్కొన్నారు. అభివృద్ధికి చిరునామాగా పనిచేస్తూ, నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని అన్నారు. శనివారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

శాంతి భద్రతలు పరిరక్షించాలి

సాక్షి, భీమవరం: పోలీసులు శాంతిభద్రతలను పరిరక్షించాలని, అదే సమయంలో ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్ గా ఉండాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ భీమవరం రూరల్ ఎస్సై మోహన్ రావును ఆదేశించారు. భీమవరం ట్రాఫిక్ ఎస్సైగా పనిచేసిన మోహన్ రావు ఇటీవల ఎస్సైల బదిలీలలో భాగంగా భీమవరం రూరల్ ఎస్సైగా నియమితులయ్యారు.

జాతర నిర్వాహకులపై కేసు నమోదు

పాలకోడేరు: అనుమతి లేకుండా జాతర నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. మోగల్లులో పుంతలో ముసలమ్మవారి జాతర నిర్వహించారు. దీంతో కమిటీ సభ్యులపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలో మోటారుసైకిల్‌పై వెళుతున్న వ్యక్తులను టిప్పర్ లారీ ఢీకొనడంతో గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం వెంకటేశ్వరరావు చెప్పారు. పాలకొల్లు మండలం తిల్లపూడి గ్రామానికి చెందిన కుంచె వెంకటసూర్యనారాయణ తన బంధువుతో కలిసి శనివారం తెల్లవారుజామున భీమవరం నుంచి తిల్లపూడి వెళుతుండగా బుధవారం మార్కెట్‌లోని వాటర్ ట్యాంక్ వద్దకు వెళ్లే సరికి ఆవు అడ్డురావడంతో మోటారు సైకిల్ అదుపు తప్పింది అదే సమయంలో అటుగా వెళుతున్న టిప్పర్‌లారీ ఢీకొనడంతో గాయాలై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు చెప్పారు.

మానవత్వం, నైతికత పెంపొందాలి



స్థానిక ముస్లిం వీధిలో జాగృతి ఉద్యమ కరపత్రాల్ని ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామి హింద్ సభ్యులు

ఆకివీడు: నేటి సమాజంలో మానవత్వం, నైతికత నశించిపోతున్నాయని, ప్రజల్లో మానవ సంబంధాలు పెంపొందించేందుకు జమాతే ఇస్లామి హింద్ సంస్థ జాగృతి ఉద్యమం చేపట్టిందని సంస్థ స్థానిక అధ్యక్షుడు ముహమ్మద్ షహాజాద్ చెప్పారు. స్థానిక ముస్లిం వీధిలోని మదర్సా కేంద్రంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విలువలు దిగజారుతున్న సమాజంలో అశాంతి, అలజడి, నేరాలు, మారణ హోమాలు అధికమయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మనిషిలో నైతిక పరివర్తన కలిగినప్పుడే మానవతా విలువలు వికసిస్తాయన్నారు. ఈ నెల 20 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా జాగృతి ఉద్యమం కొనసాగుతోందన్నారు. ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశాలు, వివిధ మత గురువులతో చర్చా గోష్టి, కరపత్రాలు, పోస్టర్ల పంపిణీ, సోషల్ మీడియా ద్వారా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు షహాజాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సయ్యద్ ఫారూఖ్, మహబూబ్ జానీ, కార్యకర్తలు ముహమ్మద్ అతిఫ్, సయ్యద్ ఆరిఫ్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల 43వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా విద్యార్థులు సినీ, కూచిపూడి,శాస్త్రీయ సంగీతానికి అనుగుణం ప్రదర్శించిన డ్యాన్స్‌లు తోటి విద్యార్థులను ఎంతో ఉత్సాహపర్చాయి.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక 14వ వార్డులోని శ్రీఅభయసాయి ధ్యాన మందిరం 30వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శనివారం సంప్రదాయబద్ధంగా సాయిబాబా వారికి అన్నాభిషేకం నిర్వహించారు. గుణ్ణం విశ్వేశ్వరరావు, దుర్గాభవాని దంపతులతో బాబావారికి 22 ద్రవ్యాలతో వేదమంత్రాల నడుమ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వైభవంగా అన్నాభిషేకం చేసి బాబా వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.